

చింతలపూడి : మేరీ ఎమ్మాక్యులేట్ హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



టి.నరసాపురం : మహిళలను సత్కరించిన దృశ్యం



కొయ్యలగూడెం: పరింపూడిలో పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

చింతలపూడి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం చింతలపూడి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి వారు అన్ని రంగాల్లో విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల మహిళలను సత్కరించారు. చింతలపూడి ప్రభుత్వాసుపత్రి వద్ద రోగులకు ఉచిత సేవలందిస్తున్న ధెరేసమ్మను ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాదీప్తి, ఐద్వా నాయకురాలు ఎం. వరలక్ష్మి దేవి, కురిసెట్టి అనురాధ, పెరుగు గోపిలక్ష్మి, సీఐటీయూ, జన విజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కమిషనర్ డి.పావనిని శాలువాతో సత్కరించారు. మానవత చైర్మన్ ఎ అప్పారావు, కన్వీనర్ కె నాగ చిన్నారావు, సభ్యులు పాల్గొన్నారు. స్థానిక మేరీ ఎమ్మాక్యులేట్ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు, ప్రతిభ అవార్డు గ్రహీత కంభం సుజాతను సత్కరించారు.

ఆటల పోటీలు

బుట్టాయగూడెం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వెలుగు ఏపీఎం ఎస్‌వీవీ పద్మావతి అన్నారు. స్థానిక మండల సమైఖ్య కార్యాలయం వద్ద శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్ పోటీల్లో మహిళలతో పాటు ఏపీఎం, సూపర్‌వైజర్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ, పద్మజ్యోతి వెలుగు సీసీలు దుర్గారావు, ప్రసాద్, సీతారామయ్య, సుందర్, వరలక్ష్మి, వీఓఏలు, ఈసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో సత్కారం

టి.నరసాపురం : కృష్ణాపురంలో బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంతర శ్రమజీవులైన మహిళామూర్తులను సన్మానించారు. అనంతరం ప్రారంభించిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణలో మాజీ సర్పంచ్ జరభల పూర్ణయ్య మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్, అధ్యక్షుడు జరభల చందా నాయక్ పాల్గొన్నారు. ప్రకాష్ నగర్ షాలేము చర్చిలో ఫైర్ ప్రెయర్ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో 21 మంది మహిళా సేవకురాళ్లను శాలువాతో సత్కరించారు. కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఫైర్ ప్రెయర్ టీం గౌరవ అధ్యక్షుడు కురసం నిరీక్షణ రావు, సీహెచ్ హోషేయ, అధ్యక్షుడు జి.జ్ఞానరాజు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ వరం

కొయ్యలగూడెం: మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు వచ్చే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సాకారం కాబోతోందని, ఇది మహిళలకు వరం అని పరింపూడి పంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమార్ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులను పాలకవర్గం, కార్యదర్శి కె.సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాజవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న 58 మంది మహిళా ఉద్యోగుల్ని ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

కోర్టు ప్రాంగణంలో...

జంగారెడ్డిగూడెం : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణం నందు నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జ్ సీహెచ్ కిషోర్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన కోర్టు సిబ్బందికి మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్ తేజస్విని, ఏపీపీ శ్యామల, మహిళా కోర్టు సిబ్బందిని శాలువాలతో సత్కరించారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో

4వ వార్డ్ ఇందిరానగర్ కాలనీ అంగన్‌వాడి సెంటర్‌లో కౌన్సిలర్ వలవల తాతాజీ, మేరీ సుశీల దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ప్రతిభా పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేర్వేరు శాఖల్లో స్వీపర్లుగా పనిచేస్తున్న భార్యభర్తలు వెంకటేష్, ప్రభావతిలని ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ సరోజరెడ్డి మాట్లాడుతూ స్వీపర్లుగా పనిచేస్తూనే తమ ఇద్దరు కొడుకుల్ని డాక్టర్లను చేయడం గొప్ప విషయమని అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలల్లో రాణించాలన్నారు. అనంతరం మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఘనంగా సన్మానించారు.



కుక్కునూరు : జెండా ఎగరవేస్తున్న మహిళా సమాఖ్య నాయకులు



పోలవరం రూరల్ : గుంజవరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు



లింగపాలెం : తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగినులకు సత్కారం



జంగారెడ్డిగూడెం : జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ తేజస్వినిని సత్కరిస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం : మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు



కామవరపుకోట : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా అధ్యాపకులను సన్మానించిన దృశ్యం

చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

కుక్కునూరు : మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సీఐటీయూ, ఏపీ మహిళా సమాఖ్య నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుక్కునూరులోని బరపటినగర్, సుందరయ్య భవనంలో జరిగిన కార్యక్రమాల్లో మహిళా సంఘాల నాయకులు కేక్ కట్‌చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో నాయకులు బాడిస సుజాత, వరకా శ్యామల మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా మహిళలపై దాడులు ఆగడం లేదన్నారు. చట్టాలు పటిష్టంగా అమలు చేసి మహిళలకు అండగా నిలవాలన్నారు.

గుంజవరంలో ర్యాలీ

పోలవరం రూరల్ : మహిళా దినోత్సవం సందర్భంగా గుంజవరం గ్రామంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ టి.చిన్ని అధ్యక్షతన నిర్వహించగా, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సి.విజయ పాల్గొని మాట్లాడారు. మహిళలు సంఘటిత పోరాటాలకు, హక్కుల సాధనకు కృషిచేయాలన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, ఎస్.మోహన్, సవలం రాంబాబు, కారం దుర్గ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుంజవరం, మామిడిగొంది, సింగన్నపల్లి, చేగొండిపల్లి గ్రామాల్లో ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని ఎంఆర్‌సీ కార్యాలయం నందు పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు లావణ్యకు ఏలూరు సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ మెసెంజర్ అవార్డును అందించారు.

సమాజ ప్రగతికి దిక్సూచి

లింగపాలెం : సమాజ ప్రగతికి మహిళలే దిక్సూచి అని తహసీల్దార్ ఎస్‌వీడీవీ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. శనివారం లింగపాలెం, ధర్మాజీగూడెం ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగ మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె వాణి, ఈవోపీఆర్‌డీ జేవీ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల విజయానికి కృషి చేయాలి

వేలేరుపాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇప్పలగుంపు, ఉదయ నగర్, జీడిగింపు, రామవరం, రెడ్డిగూడెం, బండలబోరు, మల్లారం, భూదేవి పేట, జిన్నెలగూడెం, మద్దిగట్ల, పాత పూచిర్యాల, పూచిర్యాల కాలనీ, కన్నాయి గుట్ట, శాఖపల్లి, కొత్తూరు, పాత రెడ్డిగూడెంలలో జెండా ఆవిష్కరించారు. మహిళల విజయానికి కృషి చేయాలన్నారు.

క్లుప్తంగా

ప్రజావ్యతిరేక కార్యక్రమాలను ఎండగట్టాలని సూచన



డీఎన్నార్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కామవరపుకోట: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలను ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, చింతలపూడి నియోజకవర్గం ఇన్‌చార్జి కంభం విజయరాజు పార్టీ శ్రేణులకు సూచించారు. శనివారం ఏలూరులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మండల నేతలు డీఎన్నార్, విజయరాజులను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేస్తూ, అధికార పార్టీ చేసే ప్రజావ్యతిరేక కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిని చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ రాయంకుల సత్యనారాయణ, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహనరావు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు గుర్రాల రవికుమార్, చింతలపూడి నియోజకవర్గం ప్రచార కమిటీ కన్వీనర్ బాబురావు, దివ్యాంగుల కమిటీ చైర్మన్ చొక్కా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సరమ్మ పేరంటాల ఉత్సవాలు



లింగపాలెం: లింగపాలెం గ్రామదేవత సరమ్మ పేరంటాల ఉత్సవాలు ఈనెల 9వ తేదీ నుంచి 21వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మేళతాళాలు, విచిత్ర వేషధారణలు, కోలాటాల నడుమ అమ్మవారిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించనున్నారు. 13వతేదీ మధ్యాహ్నం 12 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, 21వ తేదీన అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. 11 రోజులు పాటుజరిగే ఈ ఉత్సవాలకు స్థానికులతోపాటు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు.

తాటాకిల్లు దగ్ధం



బాధితులకు సహాయం అందిస్తున్న సర్పంచ్ తెల్లం రాముడు, రెవెన్యూ సిబ్బంది

బుట్టాయగూడెం: వీరమద్దిగూడెంలో గురుగుంట్ల లక్ష్మి అను కొండరెడ్డి మహిళకు చెందిన తాటాకిల్లు శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఆమె తన పిల్లలిద్దరితో పొలం పనులకు వెళ్లగా మధ్యాహ్నం సమయంతో ఇల్లు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో ఉన్న రూ. 30 వేల నగదుతోపాటు, అన్నీ కాలి బూడిద కాడంతో నిరాశ్రయలుగా మిగిలామని బాధితురాలు వాపోయింది. దొరమామిడి సర్పంచ్ తెల్లం రాముడు, రెవెన్యూ సిబ్బంది బాధితురాలికి రూ. 2500 నగదు, బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు.

తాచుపాము పట్టివేత



గోధుమ తాచును పట్టుకున్న క్రాంతి

జంగారెడ్డిగూడెం: శ్రీనివాసపురంలో పోల్నాటి శ్రీనివాస్ పామాయిల్ తోటలో శనివారం స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి 6 అడుగుల గోధుమ తాచును పట్టుకున్నారు. పట్టుకున్న పామును సురక్షితంగా సమీపంలోని అడవిలో వదిలివేశారు.

మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టాలి



పద్మవారిగూడెంలో ఆస్పత్రి నిర్మాణం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: పద్మవారిగూడెం సమీపంలోని అల్లికాల్వ వద్ద నిర్మాణంలో ఉన్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసేలా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మొడియం నాగమణి, జిల్లా కార్యదర్శి తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుల బృందం ఆస్పత్రి నిర్మాణం చేస్తున్న ప్రదేశాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో సుమారు రూ. 50 కోట్ల వ్యయంతో ఆస్పత్రి నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆ పనులు సక్రమంగా జరగడంలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఈ పనులను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోలోజు నాగేశ్వరరావు, పాడియం భీమరాజు, చంద్రు బుల్లమ్మ, వెంకటలక్ష్మీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ వేదిక

చింతలపూడి: పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ చక్కటి వేదిక జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు సూచించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో 180 కేసులు పరిష్కారం అయినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. క్రిమినల్ కేసులు, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదా, మనోవర్తి ,ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసినట్లు తెలిపారు.వా టిలో ఎక్సైజ్ కేసులు, ఇతర కేసుల నిమిత్తం మొత్తం రూ.43,80,580 రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి మధుబాబు మాట్లాడుతూ కేసులు రాజీ చేసుకునే వారు నిత్యం జరిగే ఫ్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్‌కి హాజరై కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి నాగేశ్వరరావు, ఏపీపీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడి: కక్షిదారులకు కేసు పత్రాలను అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

లోక్‌అదాలత్‌లో 384 కేసుల పరిష్కారం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ అధ్యక్షత వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఐసీపీ కేసులు 49, ఎక్సైజ్ కేసులు 109, సివిల్ కేసులు 6, చెక్‌బౌన్స్ 3, మనోవర్తి 5, డొమెస్టిక్ వైలెన్స్ కేసులు 3, బెంచ్ కోర్టు 195 కేసులు, ఎస్‌టీసీ కేసులు 1, బీఎస్ఎన్ఎల్ 2, బ్యాంకు రికవరీ కేసులు 12 మొత్తం 384 కేసులు రాజీ అయినట్లు కిషోర్ కుమార్ తెలిపారు. ఏపీపీ శ్యామల, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

నాటుసారా కేంద్రాలపై దాడి

కుక్కునూరు: వేలేరు శివారులోని నాటుసారా తయారీ కేంద్రాలపై శనివారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు కుక్కునూరు సీఐ ఎం రమేష్ బాబు తెలిపారు. సారా తయారు చేసే వారి సమాచారాన్ని అందించాలని ప్రజలకు సూచించారు.

మహిళా సాధికారతకు జగన్ ఎనలేని కృషి



ద్వారకాతిరుమల : కేక్ కట్ చేస్తున్న మాజీ హోం మంత్రి వనిత



బుట్టాయగూడెం: దుద్దుకూరులో మహిళలను శాలువా కప్పి సన్మానిస్తున్న బాలరాజు, రాజ్యలక్ష్మి


ద్వారకాతిరుమల: మహిళా సాధికారత కోసం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని మాజీ హోం మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని పార్టీ కార్యాలయం వద్ద శనివారం గోపాలపురం నియోజకవర్గ స్థాయిలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోను రాణించాలని జగన్ ఆశించారన్నారు. అందులో భాగంగానే వైఎస్సార్ సీపీ పాలనలో దాదాపు అన్ని పథకాలను మహిళలకే అందించారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చిందని, అందులో ఏ ఒక్కటైనా అమలు చేసిందా అని ప్రశ్నించారు. ఇది మహిళలను దగా చేయడం కాదా అని అన్నారు. కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాకారపు బంగారమ్మ, ద్వారకాతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల పార్టీ కన్వీనర్లు, నేతలు పాల్గొన్నారు.

హామీలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వ పాలనలో మహిళల జీవన విధానం దుర్భరంగా మారిందని వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ సమన్వయ కర్త తెల్లం రాజ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. దుద్దుకూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ జగనన్న పాలనలో మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేశారన్నారు. ముఖ్యంగా నామినేటెడ్ పదవుల్లో, పనుల్లో 50 శాతం రిజర్వేషన్ మహిళలకు కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు చేసిన వాగ్దానాలను అమలు చేయకుండానే వాటిని గాలికి వదిలేశారని అన్నారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఆడబిడ్డ నిధి కింద ఇస్తామని ప్రకటించిన సీఎం చంద్రబాబు 9 నెలలైనా ఆ పథకాన్ని అమలు చేయకపోవడంపై రాజ్యలక్ష్మి తీవ్రంగా మండిపడ్డారు. ఉచిత బస్ ప్రయాణంపై రోజుకోరకంగా మాట్లాడుతూ సరైన స్పష్టత ఇవ్వడంలేదని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తంగా..

శతాధిక వృద్ధురాలు మృతి



వెంకమ్మ (ఫైల్)

ద్వారకాతిరుమల: తిమ్మాపురంలో ఒక శతాధిక వృద్ధురాలు శనివారం మృతి చెందారు. గ్రామానికి చెందిన కొయ్యల మూడి వెంకమ్మకు నూరేళ్లు నిండాయి. ఈ క్రమంలో వయోభారంతో ఆమె తుది శ్వాస విడిచారు. ఆమెకు నలుగురు మగ, ఇద్దరు ఆడ సంతానం కాగా, మనుమలు, మునిమనుమలు చాలా మంది ఉన్నారు.

కనులపండువగా శివ కల్యాణం

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం శివదేవుని కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. జంగారెడ్డిగూడెంకు చెందిన దాత దొంతు ప్రణీత్, ఆలయ ఈవో మానికల రాంబాబు భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ జరిపారు.

అంజన్నకు అభిషేకం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అభిషేక సేవ నిర్వహించారు. ఆలయ ముఖమండపంపై స్వామి వారి ఉత్సవమూర్తిని ఉంచి అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం నిర్వహించారు.

శ్రీవారి సేవలో డీసీపీ

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ డీసీపీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ వేర్వేరుగా శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారు ముందుగా శ్రీవారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ద్వారకాతిరుమల: లారీ ఢీకొట్టడంతో కొండపైకి వెళ్లే ఆర్చిగేటు కూడలిలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో, కొత్త స్తంభాలను అధికారులు శనివారం ఏర్పాటు చేశారు. ఆ లైన్ గుండా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నేడు గూటాలలో ఆలయ పునః ప్రతిష్ఠ

పోలవరం రూరల్: గూటాల గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ పునః ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం ఉదయం 10.53 గంటలకు నిర్వహించనున్నారు. విగ్రహ ప్రతిష్ఠ, నూతన ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా గత నాలుగు రోజులుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు.

పొంగుటూరులో ఉచిత వైద్యశిబిరం

కొయ్యలగూడెం: పొంగుటూరులో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉండ్రాజవరపు రూతూ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు పాల్గొని సేవలు అందజేశారు. స్వచ్ఛంద సంస్థ ట్రైబల్ రూరల్ అర్బన్ సర్వీస్ సొసైటీ ద్వారా ఉచిత పరీక్షలు నిర్వహించి ఔషధాలను పంపిణీ చేశారు.

ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులో తాగునీటి అవసరాల కోసం తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను శనివారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ప్రారంభించారు.